క్లుప్తంగా

పీవీకి భారతరత్న ప్రకటించడంపై హర్షం

మన్ననూర్/ పెద్దకొత్తపల్లి/ కొల్లాపూర్: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారతరత్న ప్రకటించడంపై కొల్లాపూర్‌కు చెందిన కవి, రచయితలు హర్షం ప్రకటించారు. పీవీకి భారతరత్న రావడం సంతోషంగా ఉందని కవి, రచయితలు మధుసూదన్‌శర్మ, శీనయ్య, కృష్ణ, కోటయ్య తదితరులు అన్నారు. పెద్దకొత్తపల్లి ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్, సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. మన్ననూర్ ఎంపీటీసీ రహీం ఆర్యవైశ్య మహాసభ నాయకులు వెంకటరమణ, సత్యనారాయణ, రమేష్, నరేష్, భాస్కర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి జ్ఞాన సరస్వతి దేవాలయ బ్రహ్మోత్సవాలు

కందనూలు: తెలంగాణ రెండో బాసర నాగర్‌కర్నూల్‌లోని కొల్లాపూర్ చౌరస్తా జ్ఞానసరస్వతి మాత 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి(మాఘ మాసం) ఐదు రోజుల పాటు వసంత పంచమి వేడుకలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు దేవాలయ చైర్మన్ ఆకారపు విశ్వనాథం, కార్యదర్శి ఏలిమెటిఈశ్వరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

12న వ్యవసాయ యంత్రాల ప్రదర్శన మేళా

తాడూరు: జిల్లాలోని కేవీకే పాలెం వ్యవసాయ కేంద్రంలో 12న ఉదయం 10 గంటలకు వ్యవసాయ పరికరాలు, యంత్రాలపై పనిచేస్తున్న అఖిల భారత సమన్వయ పరిశోధనా సంస్థ హైదరాబాద్ వారితో కలిసి వ్యవసాయ యంత్రాల ప్రదర్శన మేళా నిర్వహించనున్నట్లు ఏఓ సాయిరమేశ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

గృహజ్యోతికి దరఖాస్తులు

మన్ననూర్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరుగ్యారంటీ హామీల్లో భాగంగా గృహలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు గానూ అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని అమ్రాబాద్ మండల విద్యుత్ శాఖ ఏఈ రమేష్, లైన్‌మెన్ శేఖర్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు గానూ లబ్ధిదారులు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ నెంబర్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు

చారకొండ: గ్రామాల్లో నిత్యం పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి, ప్రత్యేక అధికారి చిన్న హుస్సేన్ అన్నారు. మండలంలోని మర్రిపల్లి, గోకారం, రామచంద్రాపురం గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక అధికారి చిన్న హుస్సేన్ గ్రామాల్లో పర్యటించారు. గ్రామంలో నీటి సమస్య చూడాలని, సంబంధిత గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామాల్లో నర్సరీలో మొక్కల పెంపకంపై శ్రద్ధ వహించాలన్నారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు కేశవులు, రవి, పవన్ ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలోని 14వ వార్డు గాంధీనగర్ కాలనీలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ సత్యం పరిశీలించారు. శుక్రవారం వార్డులో సీసీ రోడ్ల నిర్మాణ పనులతో పాటుగా, డ్రెయినేజీల్లో చెత్తను శుభ్రం చేసే పనులను ఆయన పర్యవేక్షించారు. పనులను పూర్తి నాణ్యతతో పాటుగా, త్వరితగతిన పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. చైర్మన్ వెంట వార్డు కౌన్సిలర్ మంజుల, కాలనీవాసులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ శుక్రవారం కాంగ్రెస్ మండల నాయకులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని కోరారు. మోతిలాల్‌నాయక్, పర్వత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ

లింగాల: మండల పరిధిలోని శాయిన్‌పేటలోని ఎస్సీ కాలనీలో నూతనంగా వేయనున్న సీసీ రోడ్ల నిర్మాణాలకు శుక్రవారం ఎంపీటీసీ లింగస్వామి భూమి పూజ చేశారు. ఎస్సీ కాలనీలో మూడు మార్గాల్లో సీసీ రోడ్లను వేశామని తెలిపారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో వంట గదికి మరమ్మతులు చేపట్టడం జరుగుతుందన్నారు. నాయకులు మెరుగు రాజు, ఉస్సేన్, కృష్ణ, శ్రీనునాయక్, బాలస్వామి, కాశీం, శివ, గాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగు నివారణ మాత్రలు అందజేయాలి

వెల్దండ: మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం నులిపురుగు నివారణ మాత్రల పంపిణీపై ప్రాథమిక వైద్య అధికారిణి స్వరూప సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ నెల 20న జాతీయ డీవార్మింగ్ డే పురస్కరించుకొని నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో 1 నుంచి 19 ఏళ్ల వయస్సు కల్గిన వారందరికీ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఇన్‌చార్జ్ ఎంఈఓ శంకర్‌నాయక్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవన ఎరువులపై అవగాహన


తెలకపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న రావేఫ్ విద్యార్థులు

తెలకపల్లి: వ్యవసాయంలో జీవన ఎరువుల వాడకంపై రావేఫ్ విద్యార్థులు అవగాహన కల్పించారు. శుక్రవారం మండల పరిధిలోని గౌరెడ్డిపల్లిలో పాలెం వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు వివిధ అంశాలపై సూచనలు చేశారు. వ్యవసాయ పద్ధతులు, మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు, సేంద్రియ ఉత్పత్తులకు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. ఈ తరుణంలో రైతులకు పలు రకాల జీవ ఎరువులను ఉపయోగించాలని సూచించారు. అన్ని రకాల పంటల్లో విత్తన శుద్ధి చేయాలని, దీంతో ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం, సూక్ష్మ పోషకాలైన జింకు లభ్యత పంటల్లో పెంచవచ్చన్నారు. నత్రజనిని స్థిరీకరించే జీవన ఎరువులు రైజోబియం, ఆజటోబాక్టర్, అజిస్పైరిలిన్, బాస్వరం అందించే జీవన ఎరువులను మొక్కలకు అందిస్తాయన్నారు. జింకును కరిగించే సూక్ష్మజీవులు, జీవన ఎరువులను ఉపయోగించే పద్ధతుల గురించి వివరించారు. విత్తన శుద్ధి ద్వారా నారును మంచి నాటే పద్ధతి, భూమిలో వేసే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయంలో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధిస్తారని సూచించారు. రావేఫ్ విద్యార్థులు కావ్య, సాత్విక తదితరులు పాల్గొన్నారు.


వల్లబాపూర్‌లో పంటల వివరాల నమోదును పరిశీలిస్తున్న ఏఓ నాగార్జునరెడ్డి

భూసార పరీక్షలపై..

తాడూరు: మండలంలోని ఇంద్రకల్‌లో కేవీకే రావేఫ్ విద్యార్థినులు పంటల సాగుపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ సాయిరమేష్ కుమార్ మాట్లాడారు. రావేఫ్ విద్యార్థినులు భూసార పరీక్షల గురించి మట్టి నమూనా సేకరిస్తున్నారని, సేకరణలో భాగంగా ఏ నేలలో ఏ పంట వేస్తే దిగుబడి వస్తుందనే వివిధ అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియజేస్తున్నారన్నారు. నేల స్వభావాన్ని బట్టి రైతులు పంటలను సాగు చేయాలని సూచించారు. మట్టి నమూనా సేకరణకు విద్యార్థులకు రైతులు సహకరించాలన్నారు. ఇంద్రకల్‌తో పాటు తుమ్మలసూగూరు, యత్మతాపూర్, ఐతోల్‌లో విద్యాపరంగా రైతులకు వారు నేర్చుకుంటూ అవగాహన కల్పిస్తున్నారన్నారు.

క్షేత్రస్థాయిలోనే సాగు వివరాలు నమోదు

లింగాల: క్షేత్రస్థాయిలోనే పంటల సాగు వివరాలు నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి ఏఈఓలను ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని వల్లభాపూర్ శివారులో యాసంగిలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను నమోదును ఏఓ పరిశీలించారు. మండలంలోని 6 క్లస్టర్లలో ఏఈఓలు వివరాలను నమోదు చేయడంలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. సేకరించిన పంటల సాగు వివరాలను వ్యవసాయ శాఖ పోర్టల్‌లో ఉంచడం జరుగుతుందని, దీంతో రైతులకు మేలు జరుగుతుందని వివరించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఇప్పటి వరకు యాసంగిలో 1,450 ఎకరాల్లో వరి, 160 ఎకరాల్లో మొక్కజొన్న సాగయినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనిధి, రైతులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన



కల్వకుర్తి పట్టణంలోని 108 పోలింగ్ కేంద్రంలో ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న బీఎల్ఓ

కల్వకుర్తి: కల్వకుర్తి నియోజకవర్గంలోని 262 పోలింగ్ కేంద్రాల్లో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితాను ఆయా పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు ప్రదర్శించారు. పోలింగ్ బూత్‌లో ఉన్న ఓటర్ల ఫొటో వివరాలను పోలింగ్ కేంద్రం గోడపై అతికించారు. పట్టణంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆయా బీఎల్ఓలు వాటిని గోడలపై ప్రదర్శించారు. ఓటరు జాబితాలో ఉన్న వివరాలతో పాటుగా, 2014 జనవరి 1వ తేదీ వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ విధిగా ఓటుహక్కును నమోదు చేసుకోవాలని కల్వకుర్తి ఆర్డీఓ శ్రీను సూచించారు.

పెరిగిన నియోజకవర్గ ఓటర్లు

కొల్లాపూర్: కొల్లాపూర్ నియోజకవర్గ ఓటర్ల సంఖ్య రెండు నెలల వ్యవధిలో 4 వేలకు పైగా పెరిగాయి. అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 2,34,167 ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 2,38,459 కి పెరిగింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారులు నియోజకవర్గ ఓటరు లిస్టును ప్రకటించారు. నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,38,459 ఉండగా, వీరిలో పురుషులు 1,20,511 మంది, స్త్రీలు 1,17,943 మంది, థర్డ్ జెండర్లు ఐదుగురు ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల నాటి కంటె ఈసారి పురుష ఓటర్ల సంఖ్య 1,248, మహిళా ఓటర్ల సంఖ్య 3,047, థర్డ్ జెండర్ల సంఖ్య ఒకటి పెరిగింది. ప్రస్తుత ఓటరు లిస్టు ప్రకారం కొల్లాపూర్ మండలంలో 47,349, పెద్దకొత్తపల్లి మండలంలో 48,065, కోడేరు మండలంలో 35,900, పాన్‌గల్ మండలంలో 41,469, వీపనగండ్ల మండలంలో 23,281, చిన్నంబావి మండలంలో 24,821, పెంట్లవెల్లి మండలంలో 17,574 మంది ఓటర్లు ఉన్నారు.

వాల్‌పోస్టర్ల విడుదల


ఉప్పునుంతల తహసీల్దార్ కార్యాలయం వద్ద వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ఉప్పునుంతల: వ్యవసాయ, పారిశ్రామిక తదితర అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మె, భారత్‌బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల దోపిడీకి సాధనాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాజామైనొద్దీన్, బీరయ్య, తిర్మలయ్య, కురుమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి


పెద్దకొత్తపల్లిలో అల్పాహారాన్ని అందిస్తున్న ఎంపీపీ


విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్న ప్రత్యేకాధికారి వెంకటయ్య

తెలకపల్లి: విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలని ఎంపీఓ, తెలకపల్లి గ్రామ ప్రత్యేకాధికారి వెంకటయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేసి మాట్లాడారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ పరీక్షల వరకు ప్రతిరోజూ సాయంత్రం స్నాక్స్ అందజేయాలని నిర్ణయించినందున స్నాక్స్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సదుపాయాలను, సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ అంకిత భావంతో చదవాలని, అప్పుడే లక్ష్యాలను చేరుకుంటారన్నారు. పాఠశాల స్థాయి అతి ముఖ్యమైందని, దీంట్లో పరీక్షల సమయం దగ్గర పడుతుందని, ప్రతి ఒక్కరూ పరీక్షలకు సన్నద్ధమై ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. గ్రామపంచాయతీ ఈఓ భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలస్వామి, ఉపాధ్యాయులు గోవర్ధన్‌రావు, ఆనంద్, విజయభాస్కర్, యాదవరెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్ చొరవతో అల్పాహార పథకం

కందనూలు: జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అల్పాహార పథకం ప్రారంభమైందని గజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు లత తెలియజేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 'పదో తరగతి విద్యార్థులు సాయంత్రం ప్రత్యేక తరగతులకు హాజరు కావడం ద్వారా అలసిపోతున్నారని గ్రహించిన కలెక్టర్ తన ప్రత్యేక నిధులతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు సాయంత్రం అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టారని తెలియజేశారు. ఉపాధ్యాయుడు సుధాకర్ రెడ్డి, శోభన్ బాబు, యాదగిరి, సురేష్ పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు ఎదగాలి

పెద్దకొత్తపల్లి: పదో తరగతి విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు సాయంత్రం అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించారు. వెంకటేశ్వర్‌రెడ్డి, చిన్నయ్య, రవికుమార్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సింహులును వెంటనే అరెస్టు చేయాలి

మన్ననూర్: దళిత మహిళ గుడిసె లక్ష్మి మృతికి కారణమైన నర్సింహులుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి(కేఎన్‌పీఎస్) రాష్ట్ర నాయకుడు ముద్దునూరి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మన్ననూర్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నారాయణపేట జిల్లా మాద్వార్‌కి చెందిన గుడిసె లక్ష్మి గతేడాది అక్టోబర్ 14న పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై కేఎన్‌పీఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 10 మంది సభ్యులు నిజనిర్ధారణ కమిటీగా ఏర్పడి ఈ నెల 8న గ్రామానికి వెళ్లి వాస్తవాలను పరిశీలించామన్నారు. ఈ క్రమంలో లక్ష్మికి, నర్సింహులుకు వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలిసిందన్నారు. లక్ష్మి భర్త గుడిసెల కృష్ణను లొంగదీసుకుని నర్సింహులుతో సఖ్యతగా ఉండేందుకు నర్సింహులు సూచన మేరకు పురుగు మందు తాగి బెదిరించినట్లు నటించే క్రమంలో ఆరోగ్యం విషమించి మృతిచెందినట్లు నిజనిర్ధారణ అయ్యిందన్నారు. లక్ష్మి మృతికి కారకుడైన నర్సింహులుపై అట్రాసిటీ కేసుతో పాటూ 302 సెక్షన్ కింద కేసులు నమోదు చేసి శిక్షించాలని కోరారు.

వ్యక్తిపై కేసు నమోదు

వెల్దండ: మండల పరిధిలోని లింగారెడ్డిపల్లికి చెందిన అబ్దుల్ ఖరీమ్(55) వ్యవసాయ పొలం నుంచి రాత్రి సమయంలో నడుచుకుంటూ వస్తుండటంతో ఈ నెల 5న అదే గ్రామానికి చెందిన అకినమోని నరేష్ ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడు. దీంతో తీవ్ర రక్తగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మాని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ద్విచక్రవాహనదారుడైన నరేష్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి పేర్కొన్నారు.

గౌడ కులస్తులు ఐక్యమత్యంతో మెలగాలి

వెల్దండ: గౌడ కులస్తులు ఐక్యమత్యంతో ఉండి తమ హక్కులను సాధించుకోవాలని నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చుక్క అల్లాజీగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం వెల్దండలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్న గౌడకులస్తుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. గీతా కార్మికుల పెన్షన్లు, హెల్త్‌కార్డులు, లైసెన్సుల రెన్యూవల్ తదితర వాటిని పరిష్కరించుకోవాలన్నారు. ఈ నెల 11న వెల్దండలో ఏవీఆర్‌గార్డెన్‌లో నియోజకవర్గ గౌడ సంఘం, వెల్దండ మండల గౌడ సంఘం 2024 సంవత్సర నూతన క్యాలెండర్లను ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వెల్దండ గౌడ సంఘం అధ్యక్షుడు మట్ట వెంకటయ్యగౌడ్, నాయకులు బాలస్వామిగౌడ్, వెంకటయ్యగౌడ్, రుక్కుల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీఆర్‌టీయూ ఆవిర్భావ వేడుకలు


పెద్దకొత్తపల్లిలో పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో పీఆర్‌టీయూ 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి యూనియన్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు రాఘవేందర్ మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో పీఆర్‌టీయూ ముందంజలో ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కృపేందర్‌రావు, పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, సాయిప్రకాశ్‌రెడ్డి, ముస్తాక్ అహ్మద్, నరేష్, లక్ష్మీనారాయణ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నిరసన


ఆస్పత్రి ఎదుట నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని సీహెచ్‌సీలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులు ఆస్పత్రి ఎదుట నిరసన తెలియజేశారు. శుక్రవారం ఆస్పత్రి ఎదుట వీరితో పాటుగా పేషెంట్ కేర్ సిబ్బందికి జీతాలు చెల్లించాలని నిరసన చేపట్టారు. మూడు నెలలుగా జీతాలు అందక చాలా ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ శివరాంకు వేతనాలు చెల్లించాలని కోరుతూ వినతి అందజేశారు. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజశేఖర్, ఆస్పత్రి యూనియన్ అధ్యక్షుడు యాదయ్య, అంజి, వెంకటయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

వెల్దండ: నర్సరీల్లో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం భర్కత్‌పల్లిలోని నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. వేసవి కావడంతో మొక్కలు ఎండిపోకుండా నీరు అందించాలన్నారు. వర్షాకాలంలో రైతులకు మొక్కలు అందించడానికి సిద్ధం చేయాలన్నారు. ప్రతి నర్సరీల్లో 10 వేల మొక్కలను పెంచాలన్నారు. ఉపాధిహామీ కూలీలతో చెట్లకు కంచె, పాదులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్, టీఏలు, కార్యదర్శి ఉన్నారు.

చోరీలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వెల్దండ: గుర్తుతెలియని వ్యక్తులు గ్రామాల్లోకి చొరబడి చోరీలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెల్దండ ఎస్ఐ రవి పేర్కొన్నారు. శుక్రవారం కొట్రలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలందరు అప్రమత్తంగా ఉండి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు కనిపిస్తే వెంటనే ప్రశ్నించాలన్నారు. అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. శాశ్వతంగా చోరీలను అరికట్టడానికి గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దాతలు సహకరిస్తే కెమెరాల ఏర్పాటు భారంగా ఉండదన్నారు. మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు ముందుకు వచ్చి గతంలో కెమెరాల ఏర్పాటుకు కృషి చేశామన్నారు. గ్రామానికి సరిపడ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తామని ఆయన ముందుకు వచ్చారు. ఎంపీటీసీ రాములు, మాజీ ఎంపీటీసీ కడారి కృష్ణయ్య, జంగయ్యయాదవ్, రవీందర్‌రావు, మల్లయ్య, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

వరుస చోరీలపై క్లూస్ టీం ఆధారాల సేకరణ


కొట్రలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం సభ్యులు

వెల్దండ: మండల పరిధిలోని కొట్రలో వరుస చోరీలపై జిల్లా క్లూస్‌టీం శుక్రవారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆధారాల సేకరణకు కృషి చేస్తున్నారు. గ్రామంలో చోరీలు జరిగిన ఇళ్ల పరిసరా ప్రాంతల్లో ఆధారాలు సేకరిస్తున్నారు. టవర్ డంప్ ద్వారా ప్రధాన కూడిళ్లలో సెల్‌ఫోన్ సిగ్నల్ పరిశీలిస్తున్నారు. కార్యక్రమంలో క్లూస్‌టీం సభ్యులు హన్మంత్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

సింగోటంలో రామన్న అంతిమ యాత్ర

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సింగోటంలో శుక్రవారం సింగోటం రామన్న అంతిమయాత్ర నిర్వహించారు. తన వ్యవసాయ పొలంలో ఖననం చేశారు. రామన్న హత్యకు గురికావడంతో సింగోటం గ్రామం శోకసముంద్రంలో మునిగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి తల్లి బిచ్చమ్మ పార్థివదేహంపై పుష్పగుచ్చం ఉంచి నివాళి అర్పించారు. సుధాకర్ రావు యాత్రలో పాల్గొన్నారు.

కేసుపై విచారణ జరపాలి

నాగర్‌కర్నూల్ రూరల్: సింగోటానికి చెందిన రామన్న హత్య కేసును ప్రభుత్వం సీబీసీఐడీ తో సమగ్ర విచారణ జరపాలని, నిజానిజాలను నిగ్గుతేల్చాలని, హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. హైదరాబాద్ మహానగరంలో దారుణ హత్యకు గురైన రామన్న మృతిపై నిజానిజాలు నిగ్గతేలాల్సి ఉందని అన్నారు. కుంభం మల్లేష్‌గౌడ్, రవీందర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

పెద్దకొత్తపల్లి: బీజేపీ బీసీ నాయకుడైన సింగోటం రామును హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి భరత్‌కుమార్ డిమాండ్ చేశారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

నాగర్‌కర్నూల్‌రూరల్: ఆశావర్కర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ రవికుమార్‌కు అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో అవస్థలు పడుతున్న ఆశావర్కర్లకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రజాపాలన పేరుతో ఆశావర్కర్లపై అదనపు పనిభారం మోపుతున్నట్లు తెలిపారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చి, అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వర్దం పర్వతాలు, ఆంజనేయులు పాల్గొన్నారు.

శాలివాహన సంఘం కమిటీ ఎన్నిక

వెల్దండ: కుమ్మర శాలివాహన సంఘం మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గంగాపురం భీమయ్య, ఉపాధ్యక్షుడిగా దశరథం, ప్రధాన కార్యదర్శిగా కృష్ణయ్యతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కుమ్మర కులస్తులంత ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని కులస్తులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి పాండు, వెంకటేష్ ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి

కల్వకుర్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం 18 కులాల చేతి వృత్తిదారులకు హస్త కళాకారులకు చేయూతనందించేందుకు ఏర్పాటు చేసిన విశ్వకర్మ యోజన పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గా ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రూ.లక్ష మొదలుకుని రూ.3 లక్షల వరకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణసదుపాయం అందించేందుకు విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. దరఖాస్తు వెరిఫికేషన్ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం అప్పగించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని ప్రజలకు అందించడంలో విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

'మరోసారి బీజేపీ ప్రభుత్వం'

కల్వకుర్తి రూరల్: కేంద్రంలో మరో సారి నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటుకై ప్రజలందరూ బీజేపీకి అండగా నిలవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు బండెల రామచంద్రారెడ్డి కోరారు. 'పార్టీ గావ్ చలో అభియాన్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని సుద్దకల్‌లో ప్రచారం నిర్వహించారు. దేశం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలంటే నరేంద్రమోడీ నాయకత్వాన్ని బలపరిచి బీజేపీ ప్రభుత్వం వచ్చేలా సహకరించాలన్నారు. అన్ని విధాలుగా దేశం అభ్యున్నతి భద్రత బీజేపీతోనే సాధ్యమని అన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తెలకపల్లి: అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. ఏఎస్ఐ సుదీర్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం మండల పరిధిలోని నడిగడ్డ గ్రామ సమీపంలోని ప్రకృతి వనం వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను గుర్తించారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పక్క సమాచారం మేరకు ఏఎస్ఐ సిబ్బందితో అక్కడి చేరుకుని ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తాడూరు మండలం ఇటికాలకి చెందిన కృష్ణయ్య గౌడ్, తెలకపల్లి మండలం నెల్లికుదురుకి చెందిన భాస్కర్‌గౌడ్, నాగర్‌కర్నూల్ మండలం వనపట్లకి చెందిన కొండమోని వెంకటయ్య, తిరుపతయ్య, తెలకపల్లి మండలం గడ్డంపల్లికి చెందిన బొక్క శేఖర్ తమ ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు. వారి ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ సుదీర్‌కుమార్ తెలియజేశారు.